REGD. NO. M. 3152

4-12-53 శుక్రవారం

ESTD: 1930
జమీన్‌రైతు
THE ZAMIN RYOT. NELLORE.

| సంపుటి 25 | మేనేజింగ్ఎడిటర్: నెల్లూరు వెంకట్రామానాయుడు<br>సంపాదకుడు: నెల్లూరు శ్రీరామమూర్తి | సంచిక 49 |
|---|---|---|

## శ్రీ బి. యన్. రావు అస్తమయం

ప్రఖ్యాత రాజ్యాంగవిజ్ఞుడు, న్యాయశాస్త్ర ధురీణుడు శ్రీ బెనిగల్ నరసింగరావు జబ్బుతో జ్యూరిచ్‌లో చికిత్సపొందుతుండి 30 తేది ఉదయం అస్తమించారు. భారత రాజ్యాంగ రచనలో వీరు ప్రధానమైన పాత్రవహించారు. బర్మారాజ్యాంగ రచనలోగూడా వీరికి పాత్రవున్నది. ఐక్యరాజ్యసమితిలో భారత ప్రతినిధి నాయకుడుగా ఎంతో సేవ జేశారు. ఇటీవల ప్రపంచ న్యాయస్థానంలో న్యాయమూర్తిగా వుంటుండినారు. రిజర్వు బ్యాంకి మాజీగవర్నరు రామారావు, ప్రఖ్యాత పత్రికారచయిత శివరావుగారలు నరసింగరావుగారి సోదరులే, వీరి మరణానికి విభిన్న ప్రపంచం సంతాపాన్ని తెల్పింది. వీరి అంత్యక్రియలు జూరిచ్‌లోనే జరిగాయి. వీరి అస్తికలు ఇండియాకు తేబడుతున్నవి.

# ప్రకాశంగారి ప్రకటనకు సమ్మతించివుంటే ఇరు వర్గాలకు గౌరవప్రదంగావుండేది!

## 'కర్నూలులేకుంటే, విజయవాడమాత్రమెందుకుండాలె?' అన్న ధోరణిలో మంత్రివర్గం వ్యవహరించింది!

'కర్నూలులేకుంటే. విజయవాడమాత్రం ఎందుకుండాలె?' అనేధోరణిలో ముఖ్యమంత్రి ప్రకాశంపంతులు, ఉపముఖ్యమంత్రి సంజీవరెడ్డిగారు వ్యవహరించారు. కర్నూలుకు బదులు తెచ్చారు. కాని విజయవాడ - గుంటూరుకు శాశ్వతరాజధాని దక్కనీయకుండా చేయుటకు పన్నాగం పట్టారు. దీనికితోడు, విజయవాడ గుంటూరు ప్రతిపాదనను బలపరుస్తున్న లోక్‌పార్టీని దెబ్బతీయుటకు పూనుకొన్నారు. ఈ ఆలోచనల పర్యవసానమే విశాఖపట్టణం సూచన. కర్నూలులో రాజధానిని నిలుపుటకు చివరి నిమిషంవరకు తీవ్రంగా కృషిచేశామని రాయలసీమవాసులకుచెప్పి మెప్పించుటకు; లోక్‌పార్టీవారు వ్యతిరేకించేట్లయితే, తాము వాల్తేరు రాజధాని కావాలని కోరితే, లచ్చన్న ప్రభృతులు దాన్ని వ్యతిరేకించారని ఆ రెండు జిల్లాలలో ప్రచారం చేయుటకు అనువుగా యీ ఎత్తుఎత్తారు. దీనితో లోక్‌పార్టీ ఇరకాటంలో పడిపోయింది. కాని మంత్రివర్గంలోని సంజీవరెడ్డి, తిమ్మారెడ్డి వగైరాల 'శ్రీబాగ్' భక్తి కేవలం కపటమేనని, అందులో చిత్తశుద్ధి అనేది ఏమాత్రం లేదనికూడా రుజువైంది.



ఆంధ్ర శాసనసభాధ్యక్షుడు
శ్రీ నల్లపాటి వెంకట్రామయ్యగారు

## లోక్‌పార్టీని ఇరకాటంలో పెట్టుటకు వాల్తేరుసూచన!

### అనధికార తీర్మానానికి ఎందుకంగీకరించారు?

కర్నూలునుండి రాజధాని ఏపరిస్థితుల్లోను మారుటకు వీలులేదని, రాజధానిపై చర్చకు అవకాశమిచ్చుటకు వీలులేదని పట్టుదల వహించిన సంజీవరెడ్డి ప్రభృతులు అనధికార తీర్మానానికి అవకాశమిచ్చుటకు కారణమేమి అనేది ముందు ఆశ్చర్యాన్ని కల్గించింది. గవర్నరు ఉపన్యాసానికి వచ్చిన సవరణలు నెగ్గడం ఖాయమని తేలిపోయినతర్వాత ప్రభుత్వం తగ్గివచ్చిందని అందరం భావించాం. అది కొంతవరకు కారణంగావచ్చు. కాని దీనికి గవర్నరు త్రివేది ఒత్తిడి ప్రబలకారణంగా వుంటుందని విషయజ్ఞులు ఊహిస్తున్నారు.

రాజధానిప్రశ్నకు మంత్రివర్గంపై విశ్వాస అవిశ్వాసాలతో సంబంధంలేదని ముఖ్యమంత్రి ప్రకాశంగారు ప్రకటించినా, తన ఉపన్యాసానికి ఏవైనా సవరణలు నెగ్గితే, దాన్ని తాను తీవ్రంగా తీసుకోవలసి వస్తుందని గవర్నరు ముఖ్యమంత్రిని హెచ్చరించివుండవచ్చని రాజకీయజ్ఞులు ఊహిస్తున్నారు.

అంటే గవర్నరు ఉపన్యాసానికి సవరణలు నెగ్గితే, అది మంత్రివర్గానికి బలంలేనట్టుగా గవర్నరు భావించి, మంత్రివర్గాన్ని బర్తరఫ్ గావించవచ్చు. దీనివల్లనే మంత్రివర్గం రాజధాని చర్చకు ఒకదినాన్ని ప్రత్యేకించుటకు సమ్మతించడం జరిగింది. గవర్నరు యీవిధంగా హెచ్చరించడానికి కారణాలు - యీవిషయంలో ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి మధ్య వివాదాలు, లేక రాజ్యాంగసలహాదారుల సూచన వీటిరెంటిలో ఏదోఒకటి వుండవచ్చని ఊహిస్తున్నారు.

### ప్రకాశంగారి ప్రకటన

కర్నూలు నిలవలేదనేది తేలిపోయిన తర్వాత, ప్రకాశంగారు శాసనసభలో ఒక మంచి సూచనచేశారు. రెండుమూడు సంవత్సరాల తర్వాత విజయవాడ - గుంటూరు, లేక వాల్తేరు - వీటిలో దేనినైనా శాశ్వతరాజధానిగా ఎన్నుకోవచ్చునని ఆయన ప్రకటించారు. అంటే శ్రీబాగ్ ఒడంబడికకు, కర్నూలుకు ఆయన స్వస్తి చెప్పాడన్నమాట! ఇది కొంత న్యాయంగా, సమంజసంగాకూడా కనబడుతుంది. విజయవాడ - గుంటూరు వారలు ప్రకాశం పంతులుగారి ప్రకటన తప్పకుండా విజయమనే చెప్పాలి. అలాంటి సందర్భంలో వీరు కొంత దూరదృష్టిని, రాజకీయ చతురతను ప్రదర్శించి పంతులుగారి ప్రకటనను అంగీకరించి, సవర

● కొరవ 4 వ పేజీలో

### చందా లెగ్గొట్టిన పెద్ద మనుష్యులు

నారపరెడ్డి వెంకటనారాయణరెడ్డిగారు,
కంకణసముద్రం - ఉదయగిరి తా॥

అయ్యా!

మీరు 13-2-48 తేదినుండి చందాదారులుగ వుంటున్నారు. చందా రానందున 6-11-51 తేది పత్రిక నిల్పివేశాము. రెండుమారులు వి. పి. పంపితే వాపసు అయింది. 8 పర్యాయములు కార్డులు వ్రాశాము. చందా రాలేదు. ఇప్పటికి రు 10-7-0 లు బాకీవున్నది. 1-3-49 తేదిన చందా 15 రోజుల్లో పంపుతాను పత్రిక పంపుతుండమని వ్రాసిపంపినతర్వాత ఎగబెట్టి కూర్చున్నారు. ఈ విధంగా చేయడం మర్యాదగాదు. ప్రపంచం తెలిసి, చదువుకొని నాయకత్వం వహించే మీబోంట్లే యీ విధంగాచేస్తే సాధారణ మనుష్యులసంగతి చెప్పేదేమున్నది. ఇంతటనైనా చందా పంపవలసిందిగా కోరుచున్నాము.

— నెల్లూరు వెంకట్రామానాయుడు,
పత్రికాధిపతి.

# మనమంత్రుల జీతాలు

## యు.పి., బీహారులతో పోలిస్తే ఎంత?

మంత్రుల జీతాలబిల్లుకు 1000 నుండి 500 రూపాయలకు తగ్గాలని వావిలాల గోపాలకృష్ణయ్యగారు తెచ్చిన సవరణ ఒక్కఓటు మెజారిటీతో నెగ్గడంతో అది మంత్రివర్గంమీద అవిశ్వాసమని కొందరంటున్నారు.

అసలు బడ్జెట్ సమయంలో ప్రభుత్వ ప్రతిపాదనకు ఏదైనా కోతతీర్మానం ఆమోదింపబడితే, అది మంత్రివర్గంపై అవిశ్వాసమౌతుంది గాని, యిలాంటి 'స్నేప్‌ఓటింగు'ల వల్లగాదు. మంత్రివర్గానికి సంబంధించిన లోక్‌పార్టీవారు తేలికసమయాలకై పార్టీవిషయాలు చర్చించుకుంటున్నారు. ప్రభుత్వం అంతవరకు తేలికగావుందని. ఓటింగుకు వచ్చినప్పుడు 'విప్'అని పేరుపెట్టుకున్నవారు చురుకుగావుంటే అసలు యీ గొడవేవుండదు. ఈ సవరణ ఓటింగ్ సమయంలోకూడ కొందరు లోక్‌పార్టీసభ్యులు శాసనసభలో ప్రవేశించ పోయారుగాని, స్పీకరు ప్రవేశమివ్వలేదు. అందువల్ల వారు బయట వుండిపోవలసి వచ్చింది. తర్వాత సవరణ

● కొరవ 6-వ పేజీలో

ప్రశస్తమైన ఆయుర్వేదౌషధములకు
చింతలూరువారి
వేంకటేశ్వర ఆయుర్వేద నిలయము
ట్రంకురోడ్డు — నెల్లూరు.

# అన్ని ఇనాం గ్రామాలకు వర్తించునట్లు 'ఎస్టేటు' పదాన్ని స్పష్టంగా నిర్వచించాలె! ★

## కోర్టు తగాదాలను నిల్పుదలచేస్తూ ఆర్డినెన్సు జారీచేయాలని తీర్మానం

### విజయవాడలో రాష్ట్ర ఇనాం రైతు మహాసభ

అక్టోబరు 21 తేదీ శ్రీ అరిటిపూడి రామనాథం బి. ఏ., బి. యల్. గారధ్యక్షతన అంధ్రరాష్ట్ర ఇనాంరైతుల మహాసభ విజయవాడలో రహిమాన్ సాహెబ్ గారి సినిమా హాలులో జరిగింది. ఉదయం 9-30 గంటలకు విషయనిర్ణయసభ ప్రారంభమైంది. మహాసభకు ప్రతిపాదింపబడిన తీర్మానములపై జరిగిన చర్చలలో శ్రీయుతులు గొర్రెపాటి వెంకటసుబ్బయ్య, నీరుకొండ రామారావు, కె. వెంకటనారాయణదొర, సింద్రి రామస్వామి, జెడిసెని రామకోటయ్య, కొడాలి వెంకటేశ్వర్లు, యల్. పి. కుటుంబరావు, చిగురుపాటి వెంకటేశ్వరరావు, పి. అప్పలాచార్యులు గారలు పాల్గొన్నారు. చర్చల అనంతరం తీర్మానములు ఏకగ్రీవంగా ఆమోదింపబడినవి.

మధ్యాహ్నం మహాసభను వ్యవసాయశాఖా మంత్రి శ్రీ గౌతు లచ్చన్న గారు ప్రారంభించారు. ఇనాంరైతుల మధ్యనుంచి తానువచ్చినందున, వారికష్టాలేమిటో తనకు బాగా తెలుసుననీ, వారికష్టాలను మంత్రివర్గంలోని తన సహచరులదృష్టికి తీసుకొనివచ్చి, వారి యిబ్బందులను నివారించుటకై కృషి చేస్తానని శ్రీ లచ్చన్న గారు హామీయిచ్చారు.

మహాసభలో ఆమోదింపబడిన తీర్మానములను యీక్రింద యిస్తున్నాము.

#### ఎస్టేట్ ల్యాండు చట్టం సెక్షన్ 3 క్లాజు 2 (డి)ని సవరించాల

ఎస్టేట్ ల్యాండ్ చట్టం 3 వ సెక్షన్ 2 వ క్లాజులో "ఎస్టేటు" అను పదనిర్వచనం లోపభూయిష్టంగా వున్నందున హైకోర్టులు పరస్పర విరుద్ధమైన తీర్పులు యిచ్చియున్నందున యినాంరైతుల శాశ్వత జిరాయితీహక్కులకు భంగం కలిగినందున "ఎస్టేటు" అను పదమును సక్రమముగా నిర్వచించి అగ్రహారములు, శ్రోత్రియం, కండ్రిగలతో సహా అన్ని యినాం గ్రామములను 'ఎస్టేట్లు'గా పరిగణించి సెక్షన్ '3' క్లాజు 2 (డి)ని సవరణ చేయవలసినదిగానూ, అన్నిరకముల యినాములకు శిస్తుతగ్గింపుచట్టం వర్తింపచేయవలసినదిగానూ, సెక్షన్ 3 క్లాజు 2 (డి) ని యిదివరకే అమలులోకి వచ్చినట్లుగా పరిగణించి సవరించుచూ, లోగడ యివ్వబడిన తీర్పులప్రకారం శాశ్వత జిరాయితీహక్కులు కోల్పోయిన రైతులకు ఆయాభూములను తిరిగి యిప్పించవలసిందిగా ప్రభుత్వమును మహాసభవారు కోరుచున్నారు.



మహాసభను ప్రారంభించిన మంత్రి శ్రీ లచ్చన్న

#### తగాదాలను నివారించుటకు వెంటనే ఆర్డినెన్సును జారీచేయాల

పై సవరణ జరిగేవరకు ఇనాంగ్రామాల, శ్రోత్రియ, కండ్రిగల భూములనుండి రైతులను తొలగించ వీలులేదని, కోర్టుతీర్పుల నాధారం చేసుకొని అగ్రహారీకులు పాగింపుచున్న సాముదాయిక భూములు శిక్ష్య అన్యాక్రాంతములు చెల్లవని, సివిల్ కోర్టులలోను ట్రిబ్యునళ్ళలోను పెండింగులోనున్న దావాలను అప్పీళ్లను ఆపుదలచేయుచూ, కోర్టుతీర్పులవలన ఎస్టేట్లుగా పరిగణింపబడని యినాం గ్రామములలో సామ్యసిద్ధమగు మక్తాలను మామూలుకన్న హెచ్చుగా వసూలుచేయరాదని శిస్తుతగ్గింపుచట్టం ప్రకారమే శిస్తు వసూలుచేయవలెనని ఆదేశిస్తూ, అగ్రహారములనుగురించి సమగ్రమైన చట్టము వచ్చేవరకూ అగ్రహారములకు సంబంధించిన సివిల్ కోర్టులు, ట్రిబ్యునళ్ళు, సెటిల్ మెంటు ఆఫీసర్లవద్దనున్న అన్నివిధములైన యినాం గ్రామకేసులను నిలుపుదలచేయుచూ, ఒక ఆర్డినెన్సును తక్షణం జారీచేయించవలెనని యీ మహాసభవారు ప్రభుత్వమును కోరుచున్నారు.

సెక్షన్ 3 క్లాజు 2 (డి) ప్రకారం ఒక గ్రామం ఎస్టేటు అయినచో అదే చట్టము సెక్షన్ 3 క్లాజు 1 ప్రకారం గ్రామమైవున్నచో ఎస్టేటుగా పరిగణింపవలెనని మహాసభవారు ప్రభుత్వమును కోరుచున్నారు.

ఎస్టేట్ లాండ్ చట్టం 183, 185 సెక్షన్ల క్రింద ట్రిబ్యునళ్ళచే విచారణకాబడి నిర్ణయింపబడిన ఎస్టేట్ల జాబితా ప్రకారం గ్రామాలను ఎస్టేట్లుగా పరిగణించవలెనని మహాసభవారు ప్రభుత్వమును కోరుచున్నారు.

#### జమీందారీ, శిస్తుతగ్గింపు చట్టాలను సవరించాల

మద్రాసు ఎస్టేట్సురద్దుచట్టం ప్రకారం ఒకగ్రామం ఎస్టేట్ అని నిర్వచింపబడినా శిస్తుతగ్గింపువిషయం వచ్చేటప్పటికి అదేగ్రామం ఎస్టేటు అవునా కాదా అని నిర్ణయించుకొనుటకు మరలా సివిల్ కోర్టులో దావాలు చేసికోవచ్చునని మద్రాసు హైకోర్టు తీర్పుయిచ్చినందున ఆతీర్పును పురస్కరించుకొని అగ్రహారీకులు తిరిగి సివిల్ కోర్టులలో దావాలుచేసి రైతులను పీడిస్తున్నందున అట్టిదావాలకు అవకాశం లేకుండులాగున శిస్తుతగ్గింపుచట్టాన్ని, జమీందారీ రద్దుచట్టాన్ని సవరించవలెనని ప్రభుత్వమును ఈమహాసభవారు కోరుచున్నారు.

● 8 వ పేజీలో

# సోమశిలవద్ద ఆనకట్ట

## కె. సి. కెనాల్ అభివృద్ధి చేస్తున్నారు కాబట్టి పాతడెల్టా అయినా దెబ్బతినకుండా చూచుకోవలెను

నెల్లూరు డెల్టా గత రెండు సంవత్సరాలు సక్రమంగా వర్షాలురాక పైరులు నడికి నీర్లురాక దెబ్బతిన్నది. కావున సక్రమంగా పెన్నకు వచ్చే నీరును సోమశిలవద్ద ఆనకట్ట కట్టి నీటిని రిజర్వు చేసుకుంటేతప్ప లేకపోతే డెల్టా దెబ్బతింటుంది. పెన్నకు యిదివరలో అనంతపురం ప్రాంతంలో కట్టిన ఆనకట్టలు గాక గండికోట (కడపజిల్లా) వద్దకూడా ఆనకట్ట కట్టబోతున్నారు. ఇది కట్టినట్లయితే నెల్లూరు కోవూరు డెల్టాలు గట్టి దెబ్బతింటవి.

ప్రభుత్వం కడప - కర్నూలు కాలువ వృద్ధి చేయుదానికి పూనుకున్నది. 6000 ఘనపుటడుగుల నీరు దీనిగుండా ప్రవహించేటట్లు కాలువ వెడల్పుచేసేటట్లున్నది. ఈ విధంగా 6000 ఘనపుటడుగుల నీరు కె. సి. కెనాలుకు వదలినట్లయితే దీనిద్వారా మన డెల్టాకుకూడా నష్టం కలుగుతుంది. 3000 ఘనపుటడుగులపైనే కడప వరకే సరిపోతుంది. అదిగాక తుంగభద్రనీరు జూలై నెలలో ప్రవహిస్తవి. మనకు జూలై ఆఖరుదాకా నీర్ళురావు. నెల్లూరు డెల్టాలో ఆగస్టులోనే పంట కాలువలకు నీరు వస్తాయి. ఆంధ్రదేశంలో మరెక్కడా ఆగస్టు నెలలో పంటకే పైరులేవు ఈ పంటకు ఎక్కువ నీరు కావలసివస్తుంది. పెన్నకు ఎక్కువ నీరు పైరులుకోయు దంకల్లి పంటకు వచ్చేటప్పటికి నీర్లు అరుదు అవుతున్నవి. కే. సి. కెనాలుద్వారా తుంగభద్ర నీరువచ్చినట్లయితే జూన్ నెలలోనే నార్లుపోసి వ్యవసాయం ప్రారంభించవచ్చు. డిసెంబరునాటికే మనకు మొలగొలుకులు కోతకు వస్తుంది. ముందుగా పంట రావడంవల్ల మార్కెట్టులో మన ధాన్యానికి ఎక్కువ విలువవుంటుంది. కావున సోమశిలవద్ద ఆనకట్ట కట్టడం అనివిధాలా ఉపయోగిస్తుంది. కొన్ని మెట్టతాలూకాలకుకూడా యీ నీరు పారుదల వుంటుంది. క్రొత్త సాగుబడి భూములకు ఎక్కువ రాకపోకలకు అభివృద్ధి పన్ను యివ్వడానికి నిర్ణయించుకొని ప్రభుత్వాన్ని అర్థించి తగిన ఆందోళన చేస్తే ప్రభుత్వంకూడా యిందుకు సమ్మతిస్తుంది. క్రొత్తకాలువలకంటే పాత డెల్టా దెబ్బతింటున్నది కాబట్టి ప్రభుత్వం కూడా తగిన శ్రద్ధవహిస్తుంది. కావున ఎల్లరూ దీనినిగూర్చి ఆందోళనచేసి తగిన కృషి చేయుదురుగాకయని కోరుచున్నాను—

—వెన్నెలకంటి రాఘవయ్య




కామినియా నూనె

[రిజిస్టర్డు]

చాలకాలంగా మీకు ప్రియమైనది.

వెంట్రుకలు రాలడను ఆపి బాగుగ పెంచును. వెంట్రుకల మొదళ్లమీద పనిచేసి వానిని ఆరోగ్యవంతముగా - నల్లగా ఉంచును. మెదడును చల్లగానుండి చేదదీస్తును.

* * *

రెండు అణాల పోస్టేజిపంపిన శాంపిలు పంపబడును.

ANGLO INDIAN DRUG & CHEMICAL Co.,
285, Jumma Masjid - P. O. Box 2082,
BOMBAY-2.

